ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

సోమవారం 5 మే 2025

న్యూస్ బాక్స్

నేడు కాళేశ్వరం ప్రాజెక్టు కుట్ర-వాస్తవాల పై చర్చ

మంథని, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జల బాండాగారంగా నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ కుట్రలు, అసలు వాస్తవాలను ప్రజలకు తెలియజేయడానికి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాళేశ్వరం గోదావరి నది ఒడ్డున సోమవారం ఉదయం 11 గంటలకు చర్చా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలిలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మధుసుధనాచారి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ జెడ్పీ చైర్మన్ల తోపాటు సాగునీటి రంగ నిపుణులు వీరమల్ల ప్రకాష్‌లు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

గోదావరిఖని, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం పెద్దపల్లిలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్టు డీసీసీ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీదర్‌బాబుతో పాటు ఎమ్మెల్యేలు విజయ రమణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జిల్లా పరిశీలకులు హాజరవుతారన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాలోని మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. గ్రామ స్థాయి ముఖ్య కార్యకర్తలు సమావేశానికి హాజరు కావాలని, సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరుగుతుందన్నారు. సమావేశాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు.

రేపటి నుంచి ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉత్పత్తి నిలిపివేత

- జూన్ మొదటి వారంలో తిరిగి ఉత్పత్తి దశలోకి...
- హెచ్‌టీఆర్ మరమ్మతు, ఇతర మెయింటెనెన్స్ పనులు
- వర్షాకాల సీజన్‌లో యూరియాకు ఇబ్బందులు



కోల్‌సిటీ, మే 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతాంగానికి అండగా ఉన్న ఆర్‌ఎఫ్‌సీఎల్ ఈ నెల 6వ తేది నుంచి ఉత్పత్తి నిలిపివేస్తోంది. వార్షిక మరమ్మతుల కారణంగా ప్లాంట్‌ను షట్‌డౌన్ చేస్తున్నారు. ఏప్రిల్‌లో షట్‌డౌన్ చేయాల్సి ఉండగా ఉత్పత్తి అవసరాల దృష్ట్యా మే వరకు పొడిగించారు. ప్లాంట్‌లో కీలకమైన హీట్ ట్రాన్స్‌ఫర్ రిఫార్మర్ (హెచ్‌టీఆర్)లో మరమ్మతు, అమ్మోనియా పైప్‌లైన్లు, ఇతర యంత్రాల మరమ్మ తులు చేయనున్నారు. హెచ్‌టీఆర్‌కు సంబంధించి గోద్రేజ్ సంస్థ మెయింటెనెన్స్ పనులు నిర్వహించ నుంది. సుమారు 30 నుంచి 40రోజుల పాటు ఈ మరమ్మతులు జరుగనున్నాయి. జూన్ 6 నుంచి 15వ తేదీలోగా ప్లాంట్‌లో తిరిగి ఉత్పత్తి దశలోకి వచ్చే అవకాశం ఉంది. 25రోజుల్లో షట్‌డౌన్ పూర్తి చేస్తామని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నా సాంకేతికంగా అది సాధ్యమయ్యే పరిస్థితులు లేనట్టుగా తెలుస్తోంది. వర్షాకాల సీజన్ ప్రారంభ సమయానికి కానీ ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది.

● వర్షాకాలం ముందు టెన్షన్...

రాష్ట్రంలో ఈ ఏడాది వరి, మొక్క జొన్న విస్తీర్ణం పెరగడంతో యాసంగిలో ఎరువుల వాడకం భారీగా పెరిగింది. దీంతో ఆర్‌ఎఫ్‌సీఎల్‌పై యూరియా సరఫరాకు ఒత్తిడి పెరిగింది. గతేడాది ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 11.94లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి జరిగితే రాష్ట్రానికే 4.68లక్షల టన్నులు సరఫరా చేసింది. మిగతా యూరియాను ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సరఫరా చేశారు. సాధారణంగా తెలంగాణ ప్రభుత్వం వర్షాకాల సీజన్‌కు ముందే ఏప్రిల్ నుంచి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గోడౌన్‌లలో యూరియా నిల్వలను భద్రపరుస్తుంది. బఫర్ స్టాక్‌గా ఈ నిల్వలు రైతుల అవసరాన్ని బట్టి మళ్లీ సరఫరా చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర యూరియా అవసరాల్లో ఆర్‌ఎఫ్‌సీఎల్‌సే ఎక్కువగా యూరియా సరఫరా చేస్తుంది. సంస్థ ఉత్పిత్తిలో 45శాతం తెలం గాణకే సరఫరా చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిం చిన కోటా ప్రకారం ఆర్‌ఎఫ్‌సీఎల్‌తో పాటు గుజరాత్ స్టేట్ ఫర్టిలైజర్స్, ఇఫ్కో, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్, కోరమండల్, క్రిబ్కో సంస్థలు యూరియా సరఫరా చేస్తాయి. ఇందులో గుజరాత్ స్టేట్ ఫర్టిలైజర్స్, ఇఫ్కో, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్‌కు సొంత యూనిట్లు ఉండగా కోరమండల్, క్రిబ్కోలు యూరి యాను దిగుమతి చేసుకుని రాష్ట్రాలకు సరఫరా చేస్తాయి.

● ఆర్‌ఎఫ్‌సీఎల్‌తో రాష్ట్రంపై తగ్గిన ఒత్తిడి..

రాష్ట్రంలో నీటి లభ్యతను బట్టి సాగు విస్తీర్ణంలో హెచ్చుతగ్గులుంటాయి. దానిపై ఆధారపడి యూరియా వినియోగం ఉంటుంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం సీజన్‌కు ముందు యూరియా దిగుమతి చేసుకుని బఫర్ స్టాక్‌గా నిల్వ ఉంచుకునేది. రామగుండంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ నెలకొల్పిన తరువాత అత్యవసర సమ యాల్లో రాష్ట్రాన్ని ఆదుకుంటుంది. ఈ ఏడాది యాసం గిలో సాగు విస్తీర్ణం పెరగడంతో రాష్ట్రంలో అదనంగా 2.59లక్షల టన్నులు

(మిగతా 8వ పేజీలో)

స్వల్పంగా వర్షం - విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంథని, మే 4 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా మంథని ప్రాంతంలో ఆదివారం సాయంత్రం స్వల్పంగా వర్షం కురిసింది. భారీగా గాలి దుమారం వీచింది. బలమైన గాలితో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మంథని పట్టణంలో దాదాపు మూడు గంటలకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకున్నారు. వారం రోజుల్లో మూడు సార్లు గాలిదుమారం, వర్షాలు కురియడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

తాగునీటి సరఫరా బాధ్యత గ్రామ పంచాయతీలదే

- నీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు
- ప్రతీ మండలానికి రూ.లక్ష కేటాయింపు
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో డీపీవో వీర బుచ్చయ్య



డీపీవో వీర బుచ్చయ్య

పెద్దపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో చర్యలు తీసుకుంటున్నామని, తాగునీటి సరఫరా బాధ్యత పూర్తిగా గ్రామ పంచాయతీలదేనని, అత్యవసర మరమ్మతుల కోసం ప్రతి మండలానికి లక్ష నిధులు కేటాయించారని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీపీవో: జిల్లాలో గల 266 గ్రామ పంచాయతీల్లో నిరంతరం తాగునీటిని సరఫరా చేస్తున్నాం. ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మిషన్ భగీరథ నీటినే వాడుతున్నారా, పాత పథకాలను ఉపయోగిస్తున్నారా?

డీపీవో: మిషన్ భగీరథ పథకం ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జిల్లా అంతటికీ గ్రిడ్ ద్వారా శుద్ధి చేసిన బల్క్ వాటర్ 637 ఓవర్ హెడ్ ట్యాంకులకు సరఫరా అవుతున్నది. ఇవేగాకుండా 932 బోర్‌వెల్స్, 3413 చేతి పంపులు, 306 బావులు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మరమ్మతులకు నిధులు కేటాయిస్తున్నారా?

డీపీవో: మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాలకు నీటి సరఫరా అవుతున్నాయి. ఎక్కడైనా పైప్‌లైన్లు లీకేజీ కావడం, ఇతర సమస్యలు ఉత్పన్నం అయినప్పుడు మరమ్మతు కోసం కలెక్టర్ ప్రతీ మండలానికి లక్ష రూపాయలు ఎంపీడీవోల వద్ద అందుబాటులో ఉంచారు. అవసరాన్ని బట్టి ఆ నిధులను సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి: తాగునీటి సరఫరా బాధ్యత ఎవరిది?

డీపీవో: గ్రామాల్లోని ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే బాధ్యత గ్రామ పంచాయతీలకే ఉంటుంది. నిర్వహణ అంతా పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షిస్తారు. 7 రకాల రిజిష్టర్లను నిర్వహిస్తున్నారు, గ్రామాలను ఎంపీడీవోలు, ఎంపీవోలు, మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా అధికారులు వాటిని పరిశీలిస్తారు. నీరు కలుషితం కాకుండా ఉండేందుకు ట్యాంకుల వద్ద వాటర్ ఫిల్ చేసినప్పుడల్లా క్లోరినేషన్ చేపడుతున్నాం. పాత పథకాలను వాడుకునేటప్పుడు తప్పనిసరిగా ఆ నీటిని పరీక్షించిన తర్వాతనే వాడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ప్రజలకు మీరు ఇచ్చే సలహాలేమిటి?

డీపీవో: గ్రామాల్లో 1,24,412 కనెక్షన్లు ఇచ్చాం. నల్లాల ద్వారా నీళ్ల సరఫరా అయినప్పుడు తమ అవసరాలకు పోసూ, మిగతా నీరు వృథా పోకుండా ఉండేందుకు ఆన్ ఆఫ్ ట్యాప్ పెట్టుకోవాలి. నీటి సమస్య తలెత్తిన వెంటనే పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలి. మిషన్ భగీరథ నీటిలో ఒకరికి కావాల్సిన మోతాదులో మినరల్స్ ఉంటాయి. బయట మార్కెట్‌లో దొరికే కార్బన్ వాటర్, వాటర్ బాటిళ్లలో టీడీఎస్ 40 శాతానికి మించదు. ఈ నీళ్ల తాగడం ఆరోగ్యకరం కాదు.

గ్రామ దేవతల ఆశీర్వాదం అందరికీ ఉండాలి

పాలకుర్తి మే 4(ఆంధ్రజ్యోతి):గ్రామ దేవతల ఆశీర్వాదం ప్రజలందరిపై ఉండాలని మక్కాన్‌సింగ్ సేవసమితి చైర్మన్ మనాలి ఠాకూర్ అన్నారు. పుట్నూర్‌లో ఆదివారం జరిగిన పోచమ్మ బోనాల్లో పాల్గొన్నారు. బోనమెత్తుకొని పోచమ్మ తల్లికి సమర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం తిరుపతి, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. కన్నాల గ్రామంలో జరుగుతున్న బోడ్రాయి ఉత్సవాల్లో గ్రామస్థులు పాల్గొన్నారు.



పోచమ్మ బోనాల్లో పాల్గొన్న మనాలి ఠాకూర్

పేరుకుపోతున్న సన్నరకం ధాన్యం

- కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బందులు
- ధాన్యం కుప్పల వద్దే జాగారం



కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న సన్న రకం ధాన్యం

ఓదెల, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం రాశులుగా పేరుకుపోయింది. మండలంలోని 22 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై నెల రోజులు కావస్తుంది. అంతకంటే ముందు నుంచే రైతులు సన్నరకాలైన సాంబ, బిపి-2, తదితర వరి పంటలు కోతలు పూర్తి చేసుకున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 15 వేల ఎకరాలకు పైగా సన్న రకాలు, ఎనిమిది వేల ఎకరాలకు పైగా దొడ్డు రకాల వరి సాగు చేశారు. ముందస్తుగా కోతకు వచ్చిన సన్న రకాల పంటలు కోత పూర్తి కావడంతో, ఓదెలతో పాటు పొత్కపల్లి, కనగర్తి, కొలనూర్, గుంపుల, గూడెం, జీలకుంట, కొమిర, నాంసానిపల్లి, మడక, గోపరపల్లి, హరిపురం తండా, ఉప్పరపల్లి, కొనుగోలు కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల సన్న రకాల ధాన్యం కుప్పలు పేరుకుపోతున్నాయి. ముందస్తుగా దొడ్డు రకం ధాన్యం తూకం పూర్తి కావస్తున్నప్పటికీ సన్న రకాల ధాన్యానికి తూకం లేక ఎక్కడికక్కడే మిగిలిపోయాయి. పొద్దంతా తీవ్రమైన ఎండ, రాత్రి మబ్బులు కమ్ముకొని గాలి దుమారం ఏర్పడుతుంది. దీంతో రైతులు ధాన్యం కుప్పల వద్దనే బిక్కుబిక్కుమంటూ నిద్రలేని రాత్రులను గడుపుతున్నారు. అకాల వర్షం కారణంగా సన్న రకాల ధాన్యం తూకాలను వేగవంతం చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

● రెండు వారాల నుంచి ఇక్కడే ఉంటున్న

- చింతం రాజయ్య రైతు (ఓదెల)



కొనుగోలు కేంద్రంలో సన్న రకం ధాన్యాన్ని పోసి రెండు వారాలవుతుంది. మబ్బులు కమ్ముకుంటుడంతో రెండు వారాల నుంచి ధాన్యం కుప్ప వద్దనే రాత్రి నిద్రిస్తున్న. ఎప్పుడు వర్షం వస్తుందో, ధాన్యం ఎప్పుడు తడుస్తాయోనని భయం నెలకొంది. తొందరగా తూకం వేస్తే మిగతా వ్యవసాయ పనులను చేసుకుంటా.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ..

- దర్శనానికి రెండు గంటల సమయం

7



స్వామిని దర్శనం చేసుకొంటున్న డీపీవో దంపతులు

ప్రశాంతంగా నీట్

- ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులకు అనుమతి నిరాకరణ

7

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

- సెంటినరీకాలనీలో ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

6

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, మే 4 ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం పెగడపల్లి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యకర్తలు ప్రజలకు అండదండగా ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గుర్తించి నాయకుడిగా ఎన్నుకుంటారన్నారు. గ్రామ గ్రామానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిందన్నారు. పాండవుల గుట్టపై గతంలో 270డబుల్ బెడ్‌రూంలు కట్టిన ఇండ్లకు మిగులు పనులు చేయించి కాల్వశ్రీరాంపూర్, ఇప్పలపల్లి గ్రామాలకు చెందిన నిరుపేదలకు కేటాయిస్తామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఇంటి నమూనా ప్రకారమే ఇల్లు కడితేనే ఇందిరమ్మ బిల్లు ఐదు లక్షలు దశలవారీగా వస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎవరైన నిరాధారమైన తప్పుడు ఆరోపణలు చేస్తే కేసులు తప్పవన్నారు. ప్రభుత్వం సన్నవడ్లు కూడా కొనడం ప్రారంభించిందని కాంటాలు కూడా ప్రారంభమయ్యాయన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ ఏ సమస్య వచ్చినా అలుపెరుగక పనిచేస్తున్నానన్నారు. గ్రామాల్లో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డి అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య పాల్గొన్నారు.

బస్టాండు లేక ప్రయాణికుల ఇబ్బందులు

- పాత బస్టాండ్ పునరుద్ధరించాలని డిమాండ్

8

ఎర్లీబర్డ్ ఆఫర్‌లో రామగుండం టాప్

47.6 శాతం పన్ను వసూళ్లు ● 18.94కోట్ల డిమాండ్‌కుగాను రూ.9కోట్లు వసూలు



ఆస్తి పన్ను చెల్లిస్తున్న ఇంటి యజమాని (ఫైల్)

కోల్‌సిటీ, మే 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్‌లలో ప్రవేశపెట్టిన ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపు పథకం (ఎర్లీ బర్డ్ ఆఫర్)లో రాష్ట్రంలోనే రామగుండం నగరపాలక సంస్థ రికార్డు స్థాయిలో పన్ను వసూలు చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. వార్షిక డిమాండ్‌లో 47.6శాతం పన్ను వసూలు సాధించింది. వార్షిక డిమాండ్ 2025-26లో రూ.18.94కోట్లు ఉండగా ఎర్లీబర్డ్ ఆఫర్‌లో రూ.9కోట్లకు పైగా ఈనెల 3వ తేదీ నాటికే వసూలు అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించే వారికి 5శాతం రాయితీ ప్రకటించడంతో సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ సంస్థలతోపాటు ప్రైవేట్ సంస్థల నుంచి కూడా పన్ను వసూళ్లకు ఒత్తిడి పెంచారు. కార్పొరేషన్ ప్రత్యేక అధికారి కోయ శ్రీహర్ష, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న అరుణశ్రీలు 5శాతం రాయితీ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇటీవల ప్రభుత్వ నియామకాలతో ఉద్యోగుల సంఖ్య పెరగడంతో ప్రతీ డివిజన్‌కు వార్డు ఆఫీసర్లు, వారికి అసిస్టెంట్లను నియమించారు. శానిటేషన్, రెవెన్యూ విభాగాలు సమన్వయంతో మెదలాలని ఆదేశించారు. ఈ క్రమంలో 5శాతం రాయితీ ప్రకటించడంతో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్‌తో పాటు సింగరేణి, జెన్‌కోలు కూడా ఆస్తి పన్ను చెల్లించాయి. సింగరేణి రూ.13కోట్లు, ఆర్‌ఎఫ్‌సీఎల్ రూ.1.2 కోట్లు, ఎన్‌టీపీసీ రూ.4కోట్లు చెల్లించగా బీ థర్మల్ కేంద్రం మూసివేతకు గురి కావడంతో జెన్‌కో రూ.5లక్షలు పన్నులు చెల్లించింది.



పట్టుబట్టి సాధించారు..

జూనియర్ సివిల్ జడ్జిలుగా ఉమ్మడి జిల్లా యువత

వారు కష్టాలు ఎదురైనా అధిగమించి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. కష్టపడి చదివి న్యాయమూర్తులుగా ఎదిగారు. చిన్న వయస్సులోనే జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎదిగి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఉమ్మడి జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారి గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

వైకల్యాన్ని జయించి..

సిరిసిల్ల క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి): పుట్టినప్పటి నుంచే ఉన్న వైకల్యాన్ని జయించి.. న్యాయమూర్తిగా నిలిచిందామె... అమ్మ, నాన్నల ప్రోత్సాహంతో జూనియర్ సివిల్ జడ్జిగా జాహ్నవి ఎంపికైంది. ఇటీవల విడుదలైన తెలంగాణ రాష్ట్ర జ్యుడిషియల్ సర్వీసెస్ పరీక్ష ఫలితాల్లో 29 ఏళ్ల వయస్సులోనే జాహ్నవి ప్రతిభ కనబరిచి అనుకున్న లక్ష్యాన్ని చేరింది.


జాహ్నవి

చిన్నప్పటి నుంచే న్యాయమూర్తి కావాలనే కోరిక ఎట్టకేలకు నెరవేరింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ పట్టణం భీమేశ్వరాలయం వీధికి చెందిన సంకెపల్లి సుమనారాణి, హరికిషన్‌లకు ఇద్దరు సంతానం. కొడుకు వరుణ్‌కుమార్, కూతురు జాహ్నవి. హరికిషన్ వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్. వరుణ్‌కుమార్ ఎంబీఏ చదివి ఉద్యోగం చేస్తున్నాడు. జాహ్నవి చిన్నప్పటి నుంచే వైకల్యం ఉండడంతో పక్కన ఉండే దేవయ్య బడికి వెళ్లి 3వ తరగతి వరకు చదివింది. ఆ తర్వాత వేములవాడ పట్టణంలోని జవహర్‌లాల్ నెహ్రూ విద్యాసంస్థల్లో బీకాం చదివింది. జ్యుడిషియల్ ఆఫీసర్ కావాలనే కోరికతో ఆంధ్రమహిళా సభలో ఎల్‌ఎల్‌బీ పూర్తిచేసింది. 2019లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకుని వేములవాడ బార్ అసోసియేషన్‌లో సభ్యురాలిగా చేరింది. తర్వాత పట్టుదలతో పీజీఎల్‌సెట్‌లో ర్యాంకు సాధించి ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌ఎం క్యాంపస్ సీటు పొంది లేబర్ లా పూర్తిచేసింది. ఆ తర్వాత జేఆర్‌ఎఫ్ రాసి ర్యాంకు సాధించి ఉస్మానియా యూనివర్సిటీలో లేబర్‌లాలో పీహెచ్‌డీ చేసింది. యూనివర్సిటీలో చదవు కొనసాగిస్తూనే నాలుగేళ్లుగా జ్యుడిషియల్ (జేసీజే) పరీక్ష రాస్తోంది. జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష కోసం ఇంటి వద్దనే రోజుకు 10 గంటలు చదివి 2020లో ప్రిలిమినరీ పరీక్షకు మొదటిసారి హాజరైంది. తర్వాత పట్టుదలతో చదివి నాలుగో ప్రయత్నంలో 2024 జూన్‌లో ప్రిలిమ్స్ అర్హత సాధించింది. నవంబర్‌లో మెయిన్స్ రాసి మెరిట్ సాధించి 2025 ఏప్రిల్‌లో జరిగిన ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తిచేసి జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు ఎంపికైంది.

● అమ్మ, నాన్నల ప్రోత్సాహం ఎంతో ఉంది..

- సంకెపల్లి జాహ్నవి

ఇంటర్ తర్వాత లా చదివి జడ్జి కావాలని కోరిక. బీకాం డిగ్రీ పూర్తయ్యాక లా చదివాను. ఇందుకు అమ్మ సుమనారాణి, నాన్న హరికిషన్, అన్నయ్య వరుణ్‌కుమార్ ప్రోత్సాహం ఎంతో ఉంది. నేను ఏ పోటీ పరీక్ష రాయాలన్నా నాకున్న వైకల్యం కారణంగా అమ్మ, నాన్నలు వెంట వచ్చేవారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా రోజుకు 10గంటలు చదివేదాన్ని. చివరికి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడంతో నా కల నెరవేరింది.

పేదింట వికసించిన విద్యాకుసుమం

జగిత్యాల రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): నిరు పేద కుటుంబం నుంచి వచ్చి ఖర్చుల కోసం పార్ట్ టైం జాబ్ చేస్తూ కష్టపడి చదివి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యాడు పట్నం నరేష్(26). జగిత్యాల మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన కనకయ్య, యాదవ్వ దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు.


పట్నం నరేష్

గ్రామంలో అద్దెకు ఉంటూ పొట్టకూటి కోసం నరేష్ తండ్రి కనకయ్య హమాలీగా పనిచేస్తుండగా తల్లి యాదవ్వ కూలి పని చేస్తున్నారు. తాజాగా వెలువడిన ఫలితాల్లో నరేష్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యాడు. 2024లో నరేష్ హైదరాబాద్‌లో ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేసి ఓ లాయర్ వద్ద పార్ట్ టైం జాబ్ చేస్తూ జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష కోసం ప్రిపేర్ అయ్యాడు. ఎట్టకేలకు అనుకున్నది సాధించడంతో నరేష్ ఆనం దానికి అవధులు లేకుండా పోయింది. కొడుకు ఉద్యోగం సాధించడంతో తమ కుటుంబ కష్టాలు తీరినట్టేనని నరేష్ తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కష్టాలను అధిగమించి..

హుజూరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆమెది చేనేత కార్మికురాలి కుటుంబం.. తండ్రి అనారోగ్యంతో నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు... తల్లి చేనేత కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది.. కష్టపడి చదివి తాజాగా వెలువడ్డ ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై యువతకు స్ఫూర్తినిచ్చింది. హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామా నికి చెందిన బత్తుల మల్లేశం- నర్మదలకు ముగ్గురు సంతానం. అందులో చిన్నకూతురైన మా నస చిన్నప్పటి నుంచే చదువు మీద ఆసక్తి ఉండేది. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మానస మేనత్త ఉమాదేవి-మనోజ్‌లు ఆమెను చదివించారు. మానస చదువుకోవడానికి ఆర్థికంగా సహాయ పడ్డారు. మానస ఎల్కతుర్తి మండలంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో పదో తరగతి వరకు, ఇంటర్, డిగ్రీ హుజూరాబాద్‌లో చదువుకుంది.


బత్తుల మానస

హనుమకొండలోని కాకతీయ యూనివర్సి టీలో ఎంఏ సోషియాలజీ, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం జూనియర్ సివిల్ జడ్జి ఉద్యోగ ప్రకటన చేయగా ప్రిలిమ్స్, మెయిన్స్‌లో ఉత్తమ ఫలితం సాధించి ఇంటర్వ్యూకు అర్హత సాధించింది. ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తిగా చేసి జూనియర్ సివిల్ జడ్జిగా మానస ఎంపికైంది.

కోతుల దాడిలో మహిళకు తీవ్రగాయాలు

హుజూరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పుల్లూరి త్రివేణి అనే మహిళ కోతులదాడిలో ఆదివారం తీవ్రంగా గాయపడింది. కోతులు ఒక్కసారిగా ఆమెను కరవడంతో కాలుకు తీవ్రగాయమైంది. దీంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే మహిళను ఆస్పత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గంగాధర, మే 4 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం ఉప్పరమల్యాలో పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. ఆమె తిలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరమల్యాల శివారులో పేకాడుతున్నారన్న పక్కాసమాచారం మేరకు దాడులు చేశామన్నారు. ఈ దాడిలో నలుగురు జూదమాడుతూ పట్టుబడినట్లు తెలిపారు. వారివద్ద రూ.2820 లభించాయని తెలిపారు. వారిపై కేసునమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆమె తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

గంగాధర, మే 4 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలో బెల్టుషాపుల్లో ఉన్న అక్రమమద్యంను ఆదివారం పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. గంగాధర గ్రామంలో 4బెల్టుషాపులు, హిమ్మత్ నగర్‌లో ఒక్క బెల్టుషాపుల్లో తనిఖీచేయగా 86లీటర్ల అక్రమ మద్యం లభించినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్టుషాపు నిర్వహకులపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

కూలిన వడ్ల లోడ్.. తప్పిన ప్రమాదం

శంకరపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం బస్టాండ్ సమీపంలో వడ్లలోడ్ ట్రాక్టర్‌నుంచి బస్తాలు రోడ్డుపై పడిపోయాయి. హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామం నుంచి మానకొండూర్ మండలంలోని ఓసీడ్ ప్లాంట్‌లోకి రైతు వడ్లను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో కేశవపట్నం బస్టాండ్ సమీపంలో స్పీడ్‌బ్రేకర్లు దాటుతుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ నుంచి వడ్లబస్తాలు రోడ్డుపై పడిపోయాయి. ఆ సమయంలో రోడ్డు పక్కన ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఎల్లారెడ్డిపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బాకురు పల్లి తండాకుచెందిన రమావత్ బాల్య(71) ఈనెల3న రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడని పోలీసులు ఆదివారం తెలిపారు. గ్రామంలోని వృద్ధుడు బాల్య పింఛన్ డబ్బులు తీసుకునేందుకు మండలంలోని రాచర్ల గొల్లపల్లికి వచ్చాడని పేర్కొన్నారు. రోడ్డు దాటుతున్న గ్రామంలో వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడన్నారు. మొదట సిరిసిల్లలోని ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్లారని తెలిపారు. చివరికి పరిస్థితి విషమించి వృద్ధుడు బాల్య మృతి చెందాడన్నారు. మృతుడికి ఇద్దరు కొడుకులు లాల్‌సింగ్, మోహన్, వివాహమైన ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీ సులు వివరించారు.

చింతచెట్టుపై నుంచి పడి చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

వీణవంక, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన పెద్ది ఆదిరెడ్డి(75) చింతచెట్టు పైనుంచి పడి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు వివరాల ప్రకారం.. శనివారం ఆదిరెడ్డి చింతచెట్టు ఎక్కి చింతకాయలు దులుపుతున్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారిపడగా గాయాలయ్యాయి. వెంటనే అతన్ని కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆదిరెడ్డి చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి మేనల్లుడు బండ భూపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో ఒకరి మృతి

బీర్‌పూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై చికిత్స పొందుతూ ఆదివారం గణపతిదేవ్‌రావ్ టార్పే(34) అనే వ్యక్తి మృతి చెందినట్లు బీర్ పూర్ ట్రైనీఎస్సై రాజు తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నంద గావ్ గ్రామానికి చెందిన గణపతిదేవ్‌రావ్ టార్పే తన స్నేహితుడైన సూర్యభాను మారుతితో కలిసి పీతలను పట్టడానికి శనివారం రాత్రి రోళ్లవాగు ప్రాజెక్టుకు వచ్చాడు. ఆ సమయంలో పాముకాటుకు గురై 100 నంబర్‌కు డయల్ చేశాడు. దీంతో బీర్‌పూర్ పోలీసులు వెంటనే స్పందించి బాధితుడిని అటవీప్రాంతం నుంచి తీసుకువచ్చి అంబులెన్స్ ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి గణపతిదేవ్ రావ్ టార్పే ఆదివారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్సై తెలిపారు.

ట్రాఫిక్ పోలీసుల చొరవ

● ఆటోలో డబ్బులు పోగొట్టుకున్న ప్రయాణికురాలికి తిరిగి అప్పగింత

కోల్‌సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆటోలో క్యాష్ బ్యాగ్ మరిచిపోయిన ప్రయాణికురాలికి బ్యాగు అప్పగించి తన బాధ్యతను చాటుకున్నారు రామగుండం పోలీసులు. గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీకి చెందిన పెసరి సునీత ఆదివారం రామగుండం రైల్వేస్టేషన్ నుంచి గోదావరిఖని బస్టాండ్ వరకు ప్రయాణించింది. రూ.30వేలు నగదుతో కూడిన క్యాష్ బ్యాగ్‌ను ఆటోలు మరిచిపోయింది. విషయాన్ని పక్కనే ఉన్న ట్రాఫిక్ పోలీసులకు తెలుపడంతో సీఐ రాజేశ్వర్‌రావు బస్టాండ్ వద్ద ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి ఆటో నంబర్‌ను గుర్తించారు. సమాచారాన్ని ఆటోల నిర్వాహకులకు తెలిజేయగా వారు సదరు ఆటో డ్రైవర్‌కు విషయం చెప్పడంతో అతడు ఆటోలో చూడగా క్యాష్ బ్యాగ్ అగుపించింది. రూ.30వేలు నగదుతో కూడిన క్యాష్ బ్యాగును తిరిగి ప్రయాణీకురాలు పెసరి సునీతకు సీఐ రాజేశ్వర్‌రావు అప్పగించారు.


ప్రయాణికురాలు సునీతకు బ్యాగు అందజేస్తున్న సీఐ రాజేశ్వర్‌రావు

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

● సెంటినరీకాలనీలో ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య


వసంత్ (ఫైల్)

రామగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా రామగిరి మండలంలోని సెంటినరీకాలనీలో వేముల వసంత్(27)అనే యువకుడు ఉరి వేసుకుని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వసంత్ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2లో సీ-5 ప్రైవేట్ ఓబీ కంపెనీలో వోల్వో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో గేమ్స్‌లో పాల్గొని డబ్బులు కోల్పోయిన వసంత్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్వార్టర్‌లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెట్టింగ్‌లో పాల్గొని వసంత్ నాలుగు లక్షల మేరకు అప్పుల పాలయ్యాడు. ఈ విషయం తండ్రి రవిశంకర్‌కు తెలియడంతో కుమారుడిని మందలించి గతేడాది డిసెంబర్‌లో పూర్తిగా అప్పు చెల్లించాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైన వసంత్ తిరిగి అదే వ్యవహారం కొనసాగించినట్లు తెలిసింది. ఆదివారం ఉదయం సుల్తానాబాద్‌లో ఓ ఫంక్షన్‌కు తల్లిదండ్రులు వెళ్లారు. అప్పువిషయం వారికి తెలిస్తే మందలిస్తారనే భయంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ తీగలు తెగిపడి అగ్నిప్రమాదం

● పలు వాహనాలు, 25 క్వింటాళ్ల మొక్కజొన్న దగ్ధం ● రూ.8 లక్షల నష్టం

గొల్లపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల సమీపంలో ఆదివారం గాలి దుమారానికి విద్యుత్ తీగలు తెగిపడి ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. టాటాఏస్, స్కూటీ వాహనాలు ఆరుబయట ఆరబెట్టిన 25 క్వింటాళ్ల మొక్కజొన్న పంటపూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో కాలనీ వాసులు తీవ్రభయాందోళనకు గురై విద్యుత్ అధికారులకు సమాచామందించారు. వెంటనే విద్యుత్‌అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.


దగ్ధమైన టాటా ఏస్ వ్యాన్



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, మే 4(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లాకార్యదర్శి ఎడ్ల రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెపోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు జాతీయ కార్మికసంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగసంఘాలు స్వతంత్ర్య ఫెడరేషన్లు పిలుపు నిచ్చాయన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, నగర కార్యదర్శి పుల్లెల మల్లయ్య పాల్గొన్నారు.్నరు.

ఈదురు గాలులు.. వర్షం

● విరిగిపడిన చెట్లు
● తడిసిన ధాన్యం


చిన్నముల్కనూర్‌లో నేల కొరిగిన చెట్లను తొలగిస్తున్న ఎస్సై జగదీష్


తిమ్మాపూర్‌లో తడిసిన ధాన్యం


మృత్యువాత పడిన ఆవు వద్ద రోదిస్తున్న రైతు రాజు

హుజూరాబాద్/శంకరపట్నం/జమ్మికుంట రూరల్/చిగురుమామిడి/తిమ్మాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుమండలాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిసాయి. ఎండలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నప్రజలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఆరుబయటకు వచ్చి సేదతీరారు. కొనుగోలు కేంద్రాలు, రోడ్లపై ఆరబోసిన రైతులు తమ ధాన్యాన్ని అంతా ఒక దగ్గరికి కుప్పచేసుకొని టార్పాలిన్లు కప్పారు. సుమారు 2గంటలపాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. చిగురుమామిడి మండలం చిన్నముల్కనూర్, చిగురుమామిడి తదితర గ్రామాల్లో విద్యుత్‌స్తంభాలు విరిగిరోడ్లకు అడ్డంగాపడ్డాయి. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు విరిగిపోయాయి. ఇన్‌చార్జి ఎస్సై జగదీష్ అధ్వర్యంలోచెట్లను, విద్యుత్‌స్తంభాలను తొలగించారు. ఇందుర్తి గ్రామంలో అందె రాములు ఇల్లు కూలిపోయింది. గునుకులపల్లిలో మామిడిచెట్లు కూలిపోయాయి. తోటల్లో చెట్లకు ఉన్న కాయలు రాలిపోయాయి. ఇదే గ్రామంలో కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దవగా రైతు భద్రాచలం రోదిస్తూ ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశాడు.

బీర్‌పూర్‌లో వడగళ్ల వాన

బీర్‌పూర్: జగిత్యాలజిల్లా బీర్‌పూర్ మండలంలోని పలుగ్రామాలలో ఆదివారం రాత్రి ఈదురు గాలులతోకూడిన వడగళ్ల వాన కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. పలు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. బీర్‌పూర్ మండలకేంద్రంలో ఈదురుగాలులకు పోలీస్ స్టేషన్ ఎదుటచెట్టు విరిగి పోవడంతో రాకపోకలకుఅంతరాయం కలిగింది. విద్యుత్‌స్తంభం విరిగిపడిపోగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

పిడుగుపాటుతో ఆవు మృతి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాలో పిడుగుపాటుకు రైతు బానోతు రాజుకు చెందిన ఆవు ఆదివారం మృత్యువాత పడింది. రాజు తన వ్యవసాయ పొలం వద్ద ఆవును కట్టేశాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వీచి ఒక్కసారిగా పిడుగు పడడం వల్ల ఆవు మృతిచెందింది. ఆ ప్రాంతమంతా కాలిపోయింది. విషయం తెలుసుకున్న రైతు రాజు కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని రోదించారు. ఆవు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు రాజు తెలిపారు. కాగా రైతును ప్రభుత్వం ఆదుకోవాలని తాజా, మాజీ సర్పంచ్ రజిత-తిరుపతినాయక్ కోరారు.

● సారంపల్లిలో గేదె మృతి..

తంగళ్లపల్లి:తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో రాముల లింగయ్య అనే రైతుకు చెందిన గేదె పిడుగుపాటుకు మృతి చెందింది. సుమారు రూ.లక్షనష్టం వాటిల్లిందని రైతు రాముల లింగయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

ఏటీఎంలో చోరీకి యత్నం

కరీంనగర్ క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ క్రిస్టియన్ కాలనీలోని ఎస్‌బీఐకి చెందిన ఏటీఎంలో చోరీకి యత్నించినట్లు బ్యాంక్ ఏటీఎంచానల్ ఎగ్జిక్యూటివ్ రజనీకాంత్ కరీంనగర్ రెండోఠాణా పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసుల వివరాల ప్రకారం.. క్రిస్టియన్‌కాలనీలోని ఏటీఎంలో ఆదివారం ఉదయం 4:25నిమిషాలకు ఇద్దరు వ్యక్తులు ఏటీఎం ఫ్రంట్‌డోర్ తెరిచి క్యాష్ బయటకు వచ్చేమార్గంలో టేప్ అడ్డుపెట్టారని ముంబాయినుంచి సీసీటీవీ మానిటరింగ్ టీం గుర్తించింది. ఏటీఎం చానల్ ఎగ్జిక్యూటివ్ రజనీకాంత్‌కు ఉదయం 5:38 గంటలకు ఫోన్‌చేసి అప్రమత్తం చేసింది. ఏటీఎంకు వెళ్లిపరిశీలించగా ప్లాస్టర్ అంటించినట్లు ఉంది. రజనీకాంత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో మానేరు వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇసుకరవాణా చేస్తున్న పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్‌డ్రైవర్లు రాపర్తి సతీష్, రాపర్తి శ్రీనివాస్‌పై కేసునమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

గన్నేరువరం: తిమ్మాపూర్ మండలం రేణిగుంట నుంచి గుండ్లపల్లికి ఆదివారం అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్సై అరుణ్ తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం

సుభాష్‌నగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చనేది అందరికీ తెలిసిన విషయం. అందులో చేతులు పరిశుభ్రంగా ఉంటేనే మిగతా విషయాల్లోనూ శుభ్రత పాటించవచ్చు. ప్రతి సంవత్సరం మే 5న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. మన చేతులు రోజంతా లెక్కలేనన్ని వస్తువులు, పరికరాలు తాకుతుంటాయి. చేతులపై క్రిములు పేరు కుపోతాయి. ఇవి ఇన్‌ఫెక్షన్లకు దారి తీస్తాయి. ఈ ఇనెఫెక్షన్లు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి.



● చేతులు ఇలా శుభ్రం చేసుకోవాలి

ప్రజారోగ్యానికి చేతుల పరిశుభ్రత ఒక మూలస్తంభం. సబ్బు, నీటితో సరైన చేతులు కడుక్కోవడం లేదా ఆల్కాహాలు ఆదారిత హ్యాండ్ శానిటైజర్లను ఉపయోగించడం వల్ల చేతుల నుంచి క్రిములు, బ్యాక్టీరియా, వైరస్‌లను సమర్థవంతంగా తొలగించవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. ఇంట్లో, పాఠశాలల్లో, కార్యాలయాలల్లో ఎక్కడైనా క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం వల్ల ఫ్లూ, జలుబు, జీర్ణశయాంతర ఇన్‌ఫెక్షన్లు వంటి సాధారణ అనారోగ్యాల వ్యాప్తిని నిరోధించవచ్చు. చేతులను తరుచుగా కనీసం 20 సెకన్లపాటు సబ్బు, నీటితో కడుక్కోవాలి. ముఖ్యంగా తినడానికి ముందు, రెస్ట్‌రూమును ఉపయోగించిన తరువాత, ముక్కు చీదిన తరువాత, దగ్గిన, తుమ్మిన తరువాత, జంతువులు, వాటి వ్యర్థాలను తాకినా తరువాత సబ్బు నీరు లేదా హ్యాండ్ శానిటైజర్‌ను ఉపయోగించి చేతులను శుభ్రం చేసుకోవాలి.

కొవిడ్ తర్వాత ప్రజల్లో అవగాహన పెరిగింది..

- డాక్టర్ రఘురామన్, సీనియర్ ఫిజీషియన్

ఆరోగ్య పరిరక్షణలో చేతుల పరిశుభ్రత కీలకం. కొవిడ్ తర్వాత ఈ విషయంపై ప్రజల్లో అవగాహన పెరిగింది. చేతులను పరిశుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. లేదా హ్యాండ్ శానిటైజర్ వాడాలి. పిల్లలకు చిన్నప్పటి నుంచే శుభ్రతపై అవగాహన కల్పించాలి.



లెగ్ బీటింగ్ చేస్తున్న చిన్నారులు



డైవింగ్ చేస్తున్న చిన్నారులు

జోరుగా..హుషారుగా.. స్విమ్ చేద్దామా..

- ఆనందానికి, వ్యాయామానికి ఈత
- కళకళలాడుతున్న స్విమ్మింగ్ పూల్స్

కరీంనగర్ స్పోర్ట్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల నుంచి పెద్దల వరకు వేసవిలో ఈతకు సిద్ధమవుతున్నారు. దీంతో స్విమ్మింగ్ పూల్స్‌లో సందడి పెరిగింది. పెద్దలతోపాటు పట్టణ ప్రాంత పిల్లలు ఈతపై మక్కువ పెంచుకుంటున్నారు. పల్లె ప్రజానీకం ప్రకృతి అందాల చెంత సేద తీరుతుండగా పట్టణ ప్రాంతాల వారు స్విమ్మింగ్ పూల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. కరీంనగర్‌లో పలు స్విమ్మింగ్ పూల్స్ అందుబాటులో ఉన్నాయి. నిర్వాహకులు బ్యాచ్‌ల వారీగా శిక్షణకు అవకాశం కల్పిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు రావడంతో పూల్స్ ఉదయం, సాయంత్రం కిటకిటలాడుతున్నాయి.

ఈతతో లాభాలెన్నో..

ఈత చక్కని వ్యాయామం. ఈత కొడితే అన్ని అవయవాలకు వ్యాయామం అందుతుంది. ఒంట్లో ఉన్న



అదనపు కొవ్వు కరుగుతుంది. మధుమేహంతో బాధ పడే వారికి ఉపశమనం లభిస్తుంది. నిత్యం ఈదడం ద్వారా ఆకలి, చురుకుదనం, జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతాయి. రక్తపోటు గుండె సంబంధిత వ్యాధులు అదుపులో ఉంటాయి. ఊపిరితిత్తులకు మంచి వ్యాయామం లభిస్తుంది. సుమారు 50 నిమిషాలపాటు ఈత కొడితే 300 కాలరీల వరకు శక్తి ఖర్చవుతుంది. నీటిలో ఆపద సమయాల్లో మనల్ని మనం కాపాడుకోవడమే కాకుండా ఇతరులను కాపాడవచ్చు.

ఈత కొట్టే పద్ధతులు..

ఈతను నాలుగు విధాలుగా కొట్టవచ్చు. ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లై విధానంలో ఈత కొట్టవచ్చు.

రక్షణ పద్ధతి డోవింగ్..

స్విమ్మింగ్ నేర్చుకున్న అనంతరం తప్పక ఈ రక్షణ పద్ధతి డోవింగ్(లైఫ్ సేవింగ్)ను నేర్చుకోవాలి. కొన్ని సందర్భాల్లో నీటిలో మునిగిపోతున్న వ్యక్తులనువారికి ఎలాంటి హాని కలుగకుండా రక్షించే పద్ధతి ఇది.

జాగ్రత్తలు..

- స్విమ్ చేసేముందు కాస్త జాగింగ్ చేసి స్నానం చేయడం తప్పనిసరి.
- స్వచ్ఛమైన నీటిలో మాత్రమే స్విమ్మింగ్ చేయాలి.
- చర్మవ్యాధులు, అంటువ్యాధులు ఉన్నవారిని స్విమ్మింగ్ చేసేందుకు అనుమతించవద్దు.
- పిల్లలు తమకు కేటాయించిన ప్రాంతంలోనే ఈత నేర్చుకోవాలి.



- స్విమ్ చేసేపుడు కోచ్ సూచనలు పాటించాలి. స్విమ్మింగ్ డ్రెస్, క్యాప్, గ్లాసెస్, ట్యూబ్‌లు వినియోగించాలి. కోచ్‌ల పర్యవేక్షణలో నీటిలో కూర్చోవడం, తిరగడం, తేలడం, ఎగరడం, ఈదడం వంటివి తొలుత ప్రాక్టీస్ చేయాలి.
- చెవిలోకి నీరు వెళ్తే ఫంగస్ ఏర్పడుతుంది. ఇయర్ ప్లగ్స్ వాడాలి.
- తలవెంట్రుకలు రాలకుండా క్యాప్ వాడాలి.
- స్విమ్మింగ్‌లో శిక్షణ పొందాలనుకునే పిల్లలు, పెద్దలు తప్పనిసరిగా స్విమ్మింగ్ డ్రెస్ ధరించాలి. స్విమ్ వేర్, హెడ్ క్యాప్, కంటి అద్దాలు, ఇయర్ ప్లగ్స్‌ను ధరించాలి.

వేసవి సెలవుల సద్వినియోగం..

\- అరుణవ్‌పాల్‌సింగ్



ఈ వేసవి సెలవుల్లో స్విమ్మింగ్ పూర్తిగా నేర్చుకుంటున్నాను. దీంతో వేసవి సెలవులను సద్వినియోగం చేసుకున్నట్లవుతుంది. మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ శిక్షణలో చేరాను.

సరదాగా ఉంది..

\- రేనుశ్రీ, హిమాన్షు



ఈ వేసవిలో ఎండలు అధికంగా ఉన్నాయి. ఎండ తీవ్రతను తట్టుకునేందుకు స్విమ్మింగ్ మంచి మార్గం. స్విమ్మింగ్ చేస్తుంటే సరదాగా ఉంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం శిక్షణ పొందుతున్నాను.

ఆరోగ్య ప్రదాయని స్విమ్మింగ్..

\- సంపత్ కుమార్, కోచ్



విద్యార్థులకు ఆరోగ్య ప్రదాయని స్విమ్మింగ్. ప్రతిరోజు స్విమ్మింగ్ చేస్తే ఫిట్‌నెస్ పెరుగుతుంది. నీటి ప్రమాదాల నుంచి బయట పడేందుకు దోహదపడుతుంది. విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తుంది.

స్విమ్మింగ్ సర్వరోగ నివారణి..

\- వి శ్రీనివాస్‌గౌడ్, డీవైఎస్‌వో



స్విమ్మింగ్ సర్వరోగ నివారణిగా ఉపయోగపడుతుంది. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతిరోజు స్విమ్మింగ్ చేయవచ్చు. అంబేద్కర్ స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో కోచ్‌లతో విద్యార్థులకు ప్రత్యేకమైన శిక్షణను అందిస్తు న్నాం. ఈ మధ్యనే స్విమ్మింగ్ పూల్‌ను ఆధునీక రించాం. చిన్నారుల కోసం బేబీ పూల్‌ను ప్రారం భించాం. విద్యార్థులు, యువత నుంచి ఈ వేసవిలో మంచి స్పందన లభిస్తుంది.

ప్రశాంతంగా ముగిసిన ఎప్‌సెట్ ఇంజనీరింగ్ పరీక్షలు

తిమ్మాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎప్‌సెట్-2025 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు ఆదివారం జరిగిన ఇంజనీరింగ్ విభాగం పరీక్షలో కరీంనగర్ జోన్‌లో 12పరీక్ష కేంద్రాలలో కలిపి ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగిన మొదటిసెషన్‌లో 2,535మంది విద్యార్థులకు 2,432మంది హాజరయ్యారు. 103మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగిన రెండవ సెషన్‌లో 2,535మంది విద్యార్థులకు 2,451మంది హాజరు కాగా 84మంది గైర్హాజరైనట్లు పరీక్ష నిర్వాహకులు తెలిపారు. మొత్తంగా 5,070 మంది అభ్యర్థులకు గాను 4,883 మంది అభ్యర్థులు హాజరు కాగా 187మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.



బోనాలతో ఆలయానికి తరలిన గ్రామస్థులు

ఖాసీంపేటలో ఘనంగా పోచమ్మ బోనాలు

గన్నేరువరం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసీంపేటలో గ్రామస్థులంతా కలిసి ఆదివారం పోచమ్మబోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఇంటికో బోనం ఎత్తుకుని డప్పుచప్పుళ్లతో, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండి ప్రజలంతా ఆనందంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ గంప మల్లీశ్వరి, మాజీఎంపీటీసీ ఏలేటి స్వప్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, బీజేపీ నాయకుడు ఏలేటి చంద్రారెడ్డి, అధిక సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

- దర్శనానికి రెండు గంటలు



పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, మే 4 (ఆంధ్రజ్యోతి): ఓదెల మల్లన్న ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం వివిధ జిల్లాల నుంచి భక్తులు చేరుకొని పూజలు నిర్వహించారు. డీపీవో వీర బుచ్చయ్య దంపతులు, జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్‌ఐలు కుటుంబాల వారీగా ఆలయంలో అర్చనలు, ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భక్తులసంఖ్య పెరగడంతో క్యూలో రెండుగంటలపాటు వేచిఉండి భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ మద్దసాని కుమారస్వామి డీపీవో దంపతులను సన్మానించి స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

రూ.3 కోట్లతో ఉడాయించిన ఇద్దరు వ్యాపారులు

- లబోదిబోమంటున్న బాధితులు

ఎల్లారెడ్డిపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో ఇద్దరు వ్యాపారులు సుమారు రూ 3 కోట్లు అప్పులు తీసుకుని ఉడాయించిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రాజస్థాన్‌కు చెందిన ఓ వ్యక్తి రాచర్లగొల్లపల్లికి వలస వచ్చి స్థానికబట్టల దుకాణం నిర్వహించేవాడని తెలిసింది. అతన్ని నమ్మిన పలువురు రూ1.50కోట్లవరకు బాకీలు ఇచ్చారని సమాచారం. స్థానికంగా నివసిస్తున్న మరోబట్టలు, సూపర్‌మార్కెట్ వ్యాపారి సైతం నష్టాలపాలయ్యాడని తెలిసింది. ఆయనరూ.1.50కోట్ల వరకు అప్పులు చేశాడని సమాచారం. బాకీల వారి బాధలు అధికమవడంతో రెండురోజుల కిందట ఇద్దరు వ్యాపారులు ఇళ్లకు తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఉడాయించారని తెలిసింది. రెండు రోజులుగా వ్యాపారులు కనిపించకపోవడం, ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

- కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- దర్శనానికి మూడు గంటల సమయం
- దర్శించుకున్న హైకోర్టు జడ్జి



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శైవక్షేత్రం ఆదివారం భక్తులతో పోటెత్తింది. సెలవురోజు కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, ఆవరణతో పాటుగా క్యూలైన్‌లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శనివారం సాయంత్రం చేరుకున్న భక్తులు ఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. తెల్లవారు జామున భక్తులు ధర్మదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు బారులుతీరారు. కోడెమొక్కు క్యూలైన్‌లో సుమారు మూడు గంటలపాటు నిరీక్షించినట్లు భక్తులు తెలిపారు. శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకోగా భక్తుల తాకిడి దృష్ట్యా బ్రేక్‌దర్శనం క్యూలైన్‌లోను భక్తులను అనుమతించారు. దీంతో క్యూలైన్‌లు అన్ని భక్తులతో సందడిగా మారాయి. ఆయా క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీస్వామివారికి కోడెమొక్కు చెల్లించుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. గండాదీపంలో నూనెపోస్తూ గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. పరివార దేవతాలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొని అనుబంధ ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ వరి నర్సయ్య, నరేందర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జి మధుసూదన్‌రావు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని తెలంగాణ హైకోర్టు జడ్జి బీ.ఆర్. మధుసూదన్‌రావు తన కూతురుతో కలిసి దర్శించుకున్నారు. శనివారం రాత్రి వేములవాడకు చేరుకున్న జడ్జికి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పుష్పలత, సీనియర్ సివిల్ జడ్జిలు అజయ్‌కుమార్ జాదవ్, లక్ష్మణాచారి, ప్రోటోకాల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమారులు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం రాజన్న దర్శనానికి విచ్చేసిన జడ్జికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీస్వామివారి ప్రత్యేక పూజ అనంతరం ఆలయ అద్దాల మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ శ్రీస్వామివారి శేషవస్త్రం, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

రాజన్నను దర్శించుకున్న రాష్ట్ర సైబర్ క్రైం అడిషనల్ ఎస్పీ..

వేములవాడ కల్చరల్: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర సైబర్ క్రైం అడిషనల్ ఎస్పీ చంద్రకాంత్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసి శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



జడ్జి మధుసూదన్‌రావుకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఏఈవో శ్రీనివాస్



చంద్రకాంత్‌కు రాజన్న ప్రసాదాన్ని అందజేస్తున్న అర్చకులు



స్వామి వారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

కొనసాగుతున్న నరసింహ నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో రెండో రోజు ఆదివారం నృసింహ నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల మధ్య అర్చకులు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన, పంచోపనిషత్తులచే రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. సామవేద పారా యణంతో అభిషేక పూజలు, వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండల, స్థాపిత దేవతా పూజలు, సహస్ర వరుణ స్థాపన, స్థాపిత దేవత హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.



అలంకరణలో స్వామి వారు

ప్రశాంతంగా నీట్

- ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులకు అనుమతి నిరాకరణ



ఉదయం 11 గంటలకే పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కరీంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్‌ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేయగా 2975 మంది విద్యార్థులకు 2914 మంది పరీక్ష రాశారు. 61 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. కరీంనగర్ బైపాస్‌రోడ్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్, ఎస్సారార్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరీక్ష ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఆమె వెంట నెహ్రూ యువ కేంద్ర కో-ఆర్డినేటర్ రాంబాబు, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, తహసీల్దార్ రాజేష్ ఉన్నారు.

- వివిధ నీట్ పరీక్షా కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

- **మూడు నిమిషాల ఆలస్యంతో..**



క్యూలో వేచి ఉన్న విద్యార్థులు

నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల కేంద్రంలో మూడు నిమిషాలు ఆలస్యంగా రావడంతో వేములవాడకు చెందిన కుమ్మరి వైష్ణవి పరీక్షను కోల్పోయింది. వైష్ణవితోపాటు ఆమెతల్లి పరీక్షకు అనుమతించాలని అధికారులను కోరుతూ విలపించారు. సంవత్సరం వృథా అవుతుందని, పుస్తెలతాడు అమ్మి లక్షా 60వేలతో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పించామని, పరీక్షకు హాజరయ్యేందుకు రాగా కేవలం మూడు నిమిషాల ఆలస్యంతో అధికారులు అనుమతించలేదని విద్యార్థిని తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మరో విద్యార్థికూడా ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి రాగా అధికారులు కేంద్రంలోకి అనుమతించలేదు.

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల కేంద్రీయ విద్యాలయ పరీక్ష కేంద్రంలో 384మంది అభ్యర్థులకు గాను 378మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. తెలంగాణ సాంఘిక గురుకుల పాఠశాల(సీవోఈ)లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 480మంది 467మంది హాజరు కాగా 13మంది గైర్హాజరయ్యారని అధికారులు వెల్లడించారు. ఉదయం 11గంటల నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష సమయానికి అరగంట ముందే అంటే 1.30గంటలకు పరీక్ష కేంద్రాల వద్ద గేట్లును మూసేశారు. నిమిషం నిబంధన కారణంతో కేంద్రీయ విద్యాలయానికి ఒక విద్యార్థిని అలస్యంగా రాగా ఆమెను అధికారులు అనుమతించలేదు. దీంతో అమ్మాయి నిరాశతో వెనుతిరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద ట్రాఫిక్‌తోపాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలుగునూర్‌లోని రెండు నీట్‌పరీక్ష కేంద్రాలను కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, అదనపుకలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు.

కొడిమ్యాలలో..

కొడిమ్యాల: కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి, కళాశాలలోని రెండు కేంద్రాల్లో 758 మంది విద్యార్థులకు గాను 740 మంది విద్యార్థులు హాజరు కాగా 18 మంది గైర్హాజరైనట్లు కలెక్టర్ బి.సత్యప్రసాద్ తెలిపారు. మొదటి పరీక్షా కేంద్రంలో 480 మందికి 467 మంది, రెండో పరీక్షా కేంద్రంలో 278 మందికి 273 హాజరైనట్లు పరీక్షల సూపరింటెండెంట్లు డాక్టర్ ఎస్.జగదీష్‌కుమార్, డాక్టర్ సురేష్ శ్రీపాద తెలిపారు. మల్లాపూర్ మండలం వీవీ రావుపేటకు చెందిన నవ్య అనే విద్యార్థిని రెండు నిమిషాలు ఆలస్యంగా రాగా అధికారులు అనుమతించ లేదు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఆర్డీవో మధుసూదన్‌గౌడ్ పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విశ్వనాథరాజు, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.ప్రభాకర్, తహసీల్దార్ రమేష్ పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై ఎస్.సందీప్ బందోబస్తు నిర్వహించారు.



విద్యార్థిని కంకణాన్ని తీస్తున్న పేరెంట్



ముక్కుపుడక తీస్తున్న విద్యార్థిని



పుస్తెలతాడు అమ్మానంటూ పసుపుతాడును చూపుతున్న వైష్ణవి తల్లి



కన్నీటి పర్యంతమైన వైష్ణవి, తల్లిదండ్రులు

ఉచిత క్రికెట్ శిబిరం

కోల్‌సిటీ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎం కాలనీ మైదానంలో ఈ నెల 7 నుంచి ఉచిత క్రికెట్ శిబిరం నిర్వహిస్తున్నామని కరీంనగర్ జిల్లా క్రికెట్ అధ్యక్షుడు వి ఆగంరావు తెలిపారు. ఈ శిబిరం జూన్ 6 వరకు నిర్వహిస్తామని, 13 నుంచి 23 సంవత్సరాల వయస్సు బాల బాలికలు శిబిరంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. క్రీడాకారులు ఆధార్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఫోటోతో స్థానిక జీఎంకాలనీలోని పార్క్ వద్ద ఉన్న కంప్యూటర్ కార్యాలయంలో సంప్రదించి ఎంట్రీ ఫారమ్స్‌ను పొందాలని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు, సాయంత్రం 6 నుంచి 8 వరకు సంప్రదించాలని, ఈ నెల 6 చివరి తేది అని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెం. 9866351620 సంప్రదించాలని కోరారు.

అధ్యాపకుల ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

కోల్‌సిటీ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు చేపట్టిన వినూత్న ప్రచారం రెండవ రోజు ఆదివారం కొనసాగింది. కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని గోదావరిఖని చుట్టుపక్కల గ్రామాలైన గుంజపడుగు, సుందిళ్ల, చందనాపూర్, దుబ్బపల్లి తదితర గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య గురించి వివరించారు. స్టడీ మెటీరియల్స్, డిజిటల్ తరగతులు, స్కాలర్‌షిప్స్, నీట్ కోచింగ్ వంటి సదుపాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె రమేష్, టి వెంకటప్పయ్య, ఎం సుమలత, జి ధనలక్ష్మీ, ఎం స్వప్న పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం

ఎలిగేడు, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధూళికట్టలో వెలమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పద్మనాయక కల్యాణ మండపాన్ని ఆదివారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావు కలిసి ప్రారంభించారు. వెలమ సంఘం నాయకులు చక్రధర్‌రావు, బుద్దినేని వామన్‌రావు, కొక్కిరాల మహేశ్వర్‌రావు, నర్నేని సుధాకర్‌రావు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు శిక్షణ


శిక్షణ ఇస్తున్న చిలువేరి రవళి

కాల్వశ్రీరాంపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐకేపీ పాత భవనంలో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నారు. ఎస్‌బీఐ బ్యాంకు సౌజన్యంతో ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించామని వాలంటరీ ట్రైనర్ చిలువేరి రవళి తెలిపారు. నెలకు ఒక గ్రామాన్ని ఎంచుకొని 30 మంది మహిళలకు నెలరోజులు శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్ అందిస్తామన్నారు. మండల మహిళ సంఘాల ద్వారా ఈ శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ధర్మారం, మే 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సంజీవని ఆసుపత్రి, కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రి కలసి ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. గుండె పరీక్షలు, 2డి ఈకో, ఈసీజీ తో పాటు ఫైల్స్, ఫిస్టులా అపెండిక్స్, కడుపునొప్పి, బీపీ, షుగర్ వంటి పరీక్షలను గుండె వైద్య నిపుణులు అనీష్ పబ్బ ఉచితంగా నిర్వహించారు. 200 మంది వరకు ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారని, ఆపరేషన్స్ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ తో చేసేందుకు కృషి చేస్తున్నామని సంజీవని హాస్పిటల్ వైద్యుడు ప్రశాంత్ తెలిపారు. కరీంనగర్ ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డ్రగ్స్ ఫ్రీ కంట్రీ అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వవిజ్ఞాన సొసైటీ నాయకులు

రామగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లి గ్రామంలో విశ్వవిజ్ఞాన సొసైటీ ఆధ్వర్యంలో డ్రగ్ ఫ్రీ కంట్రీ అవగాహన ర్యాలీని చేపట్టారు. ప్రోగ్రాం ఆర్గనైజర్ మల్లెపల్లి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. గాండ్ల మోహన్, తీగల శ్రీనివాస్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్ దిష్టిబొమ్మ దహనం

పెద్దపల్లిటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమాన్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో పాకిస్తాన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. పట్టణ అధ్యక్షుడు పేంజర్ల రాకేష్, మండల అధ్యక్షుడు వేల్పుల రమేష్ మాట్లాడుతూ, పహల్గామ్‌లో హిందువులను మాత్రమే టార్గెట్ చేసి పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన మరణకాండ దారుణమన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు, సీనియర్ నాయకులు తంగేడా రాజేశ్వరరావు, పోల్సాని సంపత్‌రావు కార్యకర్తలు పాల్గొన్నారు.

మతం పేరిట దాడులు సరికాదు

గోదావరిఖని, మే 4 (ఆంధ్రజ్యోతి): మతం పేరిట దాడులకు పాల్పడడం సరికాదని భీమా కోరెగావ్ సేన అధ్యక్షుడు ఇరికి మహేష్ అన్నారు. చేర్యాల్ మండలంలో దళిత యువకుడు అజమ్‌పై దాడికి నిరసనగా ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ జరిపి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహేష్ డిమాండ్ చేశారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

రామగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముడుతనపెల్లి భవాని-రవి కూతురు స్నితిక పుట్టినరోజు పురస్కరించుకొని పేద మహిళకు ఆదివారం మేకల మారుతీ అధ్యక్షతన నిత్యావసర వస్తువులను అందజేశారు. మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వేము కనకయ్య, పడాల ప్రసాద్, కొట్టె స్వామి, ఈర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండు లేక ప్రయాణికుల ఇబ్బందులు

● పాత బస్టాండ్ పునరుద్ధరించాలని డిమాండ్


నిరుపయోగంగా ఉన్న బస్టాండ్


రహదారి పైనే ఆగుతున్న బస్సులు

కాల్వశ్రీరాంపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత బస్టాండ్‌లో పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. మండల కేంద్రానికి గోదావరిఖని, పెద్దపెల్లి, సుల్తానాబాద్, జమ్మికుంట, మంథని నుంచి రోజు బస్సులు నడుస్తాయి. ఈ బస్సులలో కరీంనగర్, జమ్మికుంట, గోదావరిఖని తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్టాండ్ పక్కన ఉన్న దుకాణాల ఎదుట నిలబడాల్సి వస్తోంది. వేసవి, వర్షాకాలంలో ప్రయాణికులు ఉండేందుకు నిలువ నీడ లేక అనేక అవస్థలు పడుతుంటారు. మండల కేంద్రానికి పనుల నిమిత్తం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నిత్యం వస్తుంటారు. కనీసం రేకుల షెడ్డు ఉన్నా అందులో కూర్చునేందుకు వీలుగా ఉంటుందని, బస్సుల కోసం సుమారు గంట వరకు నిలబడి ఇబ్బందులకు గురవుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికులు బస్సుల కోసం ఎండలో నిలబడ లేక అవస్థలు పడుతున్నారు. దుకాణాల ముందు నిలబడితే దుకాణదారులు మాకు వచ్చే గిరాకీకి అడ్డంగా ఉన్నారని, పక్కకు వెళ్లిపొమ్మని చెప్తున్నారని ప్రయాణికులు పేర్కొంటున్నారు. మల్యాల మోడల్ స్కూల్ కి వెళ్లే కాల్వ శ్రీరాంపూర్ విద్యార్థులు రోడ్డుపైనే వేచి చూడక తప్పడం లేదు. నీలకంఠ చెరువు సమీపంలో కట్టిన బస్టాండుకు బస్సులు వెళ్లక పోవడంతో ప్రయాణికులు రోడ్లమీదనే ఉంటున్నారు. 20 సంవత్సరాల క్రితం మండల కేంద్రంలో ఆర్టీసీ అధికారులు సుమారు 16 లక్షలతో 20 గుంటల స్థలంలో బస్టాండ్ నిర్మించారు. ఈ బస్టాండ్ లోకి కొన్ని రోజులు బస్సులు వచ్చి పోతుండేవి. ఆ తరువాత కరీంనగర్, పెద్దపెల్లి, జమ్మికుంట బస్సులన్నీ రహదారి మీదనే నిలుపడంతో బస్టాండ్ ప్రాంతమంతా నిరుపయోగంగా ఉంది. బస్టాండ్‌లోని తలుపులు, ఫ్యాన్లు, విద్యుత్ బల్బులు, తదితర సామాన్లు దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో ఆ బస్టాండ్ ప్రాంతమంతా పశువులకు నిలయంగా మారింది. అంతేకాకుండా ఈ బస్టాండ్ ప్రాంతాన్ని ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో కబ్జాకు గురవుతుంది. బస్టాండ్ వెనుక వైపున ప్రహరి నిర్మించి బస్టాండ్ మరమ్మతులు చేపట్టి బస్సులు ఆగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రేపటి నుంచి ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉత్పత్తి నిలిపివేత

(5వ పేజీ తరువాయి)

యూరియాను అదనంగా కొనుగోలు చేశారు. డిపార్ట్‌మెంటల్ ఆఫ్ ఫర్టిలైజర్స్ సరైన సమయంలో యూరియాను అందివ్వలేదనే విమర్శలు కూడా వచ్చాయి. ఈ పరిస్థితుల్లో ఆర్‌ఎఫ్‌సీఎల్ రాష్ట్రాన్ని ఆదుకున్నది. యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో సరఫరా చేసింది.

● షట్‌డౌన్‌తో టెన్షన్...

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో షట్‌డౌన్‌తో ఉత్పత్తి నిలిపి వేయ డంతో వ్యవసాయశాఖలో కొంత టెన్షన్ మొదలైంది. ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రతీ నెల 1.35లక్షల టన్నుల ఉత్పత్తి చేస్తుంది. అందులో నుంచి 45శాతం తెలంగాణ అవసరాలకు యూరియాను ఇస్తారు. సాధారణంగా ఏప్రిల్‌లో షట్‌డౌన్ చేసుకున్నా మే మాసంలో ఉత్పత్తి జరుగుతుంది కనుక వర్షాకాల సీజన్‌కు యూరియా అందుతుంది. ఈసారి మేలో షట్‌డౌన్ చేశారు. వ్యవసాయశాఖ వద్ద యూరియా నిల్వలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. సీజన్‌కు ముందు బఫర్ స్టాక్ పెట్టుకోవాల్సి ఉంది. ఆర్‌ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్ కావడంతో ఇతర పరిశ్రమలు, విదేశాల నుంచి దిగుమతి అయ్యే యూరియాపై ఆశలు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. మే నెల ప్రారంభం నుంచి 10వేల టన్నులు రాష్ట్రానికి సరఫరా చేశారు. రాష్ట్ర అవసరాలను బట్టి 20వేల నుంచి 35వేల టన్నులు ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు టార్గెట్ పెట్టారు. జూన్‌లో ఉత్పత్తి ప్రారంభమైతే రాష్ట్రానికి యూరియాను యుద్ధ ప్రాతిపదికన సరఫరా చేయాల్సి ఉంటుంది. ఏమైన అవాంతరాలతో జాప్యం జరిగితే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిళ్లు తప్పవు.

ఘనంగా భగీరథ జయంతి


కలెక్టరేట్‌లో భగీరథ జయంతిలో పాల్గొన్న నాయకులు

పెద్దపల్లి కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా భగీరథ జయంతిని జరపడం హర్షనీయమన్నారు. గంగను భువినుండి దివికి తీసుకువచ్చిన భగీరథ మహర్షి చరిత్ర ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భగీరథ సామాజిక వర్గానికి చెందిన ఉప్పరిసాగర కులస్తులు బీసీల ఐక్యతకు భగీరథ ప్రయత్నం జరపాలని పిలుపునిచ్చారు. ఆయా మహనీయుల ఉత్సవాలను కుల ఉత్సవాలుగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్దార్‌పాపన్న, చాకలి ఐలమ్మ, కొండ లక్ష్మణ్ బాపూజీలు కులాలు, మతాలకతీతంగా సమాజ అభివృద్ధికి పోరాడారని తెలిపారు. వీరిని ఒక కులానికి, వర్గానికి పరిమితం చేయడం సరికాదన్నారు. నాగరికత పుట్టినప్పటి నుంచి సాగర ఉప్పరుల చరిత్ర నిర్మాణమైందన్నారు. నాయకులు లక్ష్మణ్, వెంకటేశం, శ్రీనివాస్, సాగర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మత ప్రచారంపై చర్యలు తీసుకోవాలి


ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు

కళ్యాణ్‌నగర్, మే 4(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్టీసీ డిపో ఎదుట ఆదివారం సంఘ్ పరివార్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్, బజరంగ్‌దళ్ నాయకులు మాట్లాడుతూ గత నెల 30న క్రైస్తవ మత ప్రచారకుడు బస్టాండ్‌లో ప్రయాణికులను మభ్యపెడుతూ మత మార్పిడికి ప్రయత్నించాడన్నారు. బస్టాండ్‌లో ఇలాంటి చట్ట వ్యతిరేక కార్యకాలపాలకు పాల్పడుతున్నా డిపో యాజమాన్యం స్పందించలేదన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ ఇప్పటివరకు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం సరికాదని, డిపో మేనేజరే బాధ్యత వహించాలన్నారు. ఈ చర్యలను అడ్డుకున్న యువకులపై పోలీసులు కేసులు నమోదు చేయడం అక్రమమన్నారు. రవీందర్, ముష్కె సంపత్, రాజు, మునిగాల సంపత్, లింగన్న, శ్రీధర్ కుమార్, దిగంబర్, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు


ఓదెల, కాల్వశ్రీరాంపూర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

ఓదెల, మే 4 (ఆంధ్రజ్యోతి): కొలనూరు హైస్కూల్‌లో 2002-2003లో చదువుకున్న పదో తరగతి విద్యార్థులు ఆదివారం 22 ఏళ్ల అనంతరం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. అనంతరం నాటి తరగతి గదుల్లో చదువుకున్న జ్ఞాపకాలు, అల్లర్లు గుర్తు చేసుకొని ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించి మెమోంటోలను అందజేశారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 2009-2010లో కాకతీయ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులు నాటి ఉపాధ్యాయులతో అనుభవాలు పంచుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడి ఒక్కచోట కలుసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. కాకతీయ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి ప్రస్తుత వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డితో పాటు పూర్వ ఉపాధ్యాయులు గూట్ల రాజు, ముస్కు తిరుపతి, కోట సదయ్య, వడ్నాల జగన్, సముద్రాల శ్రీరాములు, వడ్నాల ప్రదీప్, శ్రీనివాస్, రాజ కొమురయ్య, వడ్లూరి రాజేశ్వర్‌రావు, మెట్టు శ్రీకాంత్, ఎండి.ముఖాసీర్, సన్మానించి మెమోంటోలు అందజేశారు.

పదో తరగతి టాపర్లకు సన్మానం


నిట్టూరులో విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లి రూరల్ , మే 4 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఫలితాల్లో నిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించగా ప్రథమ, ద్వితీయ, తృతీయ మార్కులు సాధించిన విద్యార్థులను ఆదివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ప్రథమ స్థానంలో నిలిచిన కుంభాల నిత్యమీన 548/600, ద్వితీయ పోతాని ఐశ్వర్య 575, తృతీయ జంజిరాల రూపప్రియ 562 సాధించగా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా స్థాయిలో నిట్టూరు పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. స్రవంతి, సీఆర్‌పి కుంభాల సుధాకర్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా జోనల్ అవార్డు అందుకొన్న కృష్ణవేణి



అవార్డు అందుకుంటున్న కరస్పాండెంట్ తిరుపతిరెడ్డి

రామగిరి, మే 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గచ్చిబౌలిలో లీ- మెరిడియన్ లీడ్ సంస్థ ఆధ్వర్యంలో ఆల్‌ఇండియా సౌత్ జోనల్ స్థాయిలో నిర్వహించిన శిక్షా అవార్డ్ ప్రధానోత్సవంలో మండలంలోని కృష్ణవేణి విద్యాసంస్థ జోనల్ స్థాయిలో అవార్డు సాధించింది. ఈ అవార్డును లీడ్ సీఈవో సుమిత్ మోహతా, అకాడమిక్ హెడ్ దీపక్ హరిహరన్ చేతుల మీదుగా కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి అందుకున్నారు. ట్రస్మా రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ యాదగిరి గౌడ్, జిల్లా అధ్యక్షుడు కంది రవీందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు అంజారెడ్డి, సమ్మారావు, రామగుండం సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డిలు తిరుపతిరెడ్డిని అభినందించారు. అవార్డు రావడానికి కృషి చేసిన ప్రధానోద్యాయుడు బర్లశ్రీనివాస్, ఉపాధ్యాయులకు కరస్పాండెంట్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పీపీటీ ప్రవేశ పరీక్ష

కరీంనగర్ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ముకరంపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల(గర్ల్స్) పాఠశాలలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పీపీటీ ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎఫ్ జావేద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్టు (పీపీటీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రగతినగర్‌లో రెసిడెన్షియల్ విధానంలో ఉచిత విద్యకు 5వతరగతి నుంచి డిగ్రీ వరకు పాఠశాల నడుపుతున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహిస్తున్నామని తెలిపారు.

వృద్ధాశ్రమంలో నవ్వుల దినోత్సవం

కోల్‌సిటీటౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవం వీర్లపల్లెలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో నిర్వహించారు. నవ్వుల నజరాన- హాస్యవల్లరి కార్యక్రమంలో భాగంగా క్లబ్ సభ్యులు ప్రదర్శించిన కామెడీ స్కిట్‌లు, మాట్లాడే బొమ్మ ప్రదర్శనలు, ఇంద్ర జాల ప్రదర్శనలు నవ్వించాయి. దైనందిన జీవి తంలో ఒత్తిడికి గురవుతూ ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొన్నారు. సంతోష కరమైన జీవితంతో ఆరోగ్యవంతులుగా జీవితాన్ని ఆస్వాదించవ్చని, నవ్వుల ప్రయోజనాలు అందరికి తెలిపేందుకే స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్టు సభ్యులు తెలిపారు. స్మైల్ ప్లీజ్ క్లబ్ సభ్యులు మేజిక్ రాజ, చంద్రపాల్, హరి, దయానంద్ గాంధీ, విజయ్‌కుమా ర్‌గౌడ్, మాజిక్ హరి, గట్టయ్య, లెనిన్, ఆశ్రమ నిర్వాహకులు పీటీ స్వామి, సత్తయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

అరుణోదయ రామారావుకు ఘన నివాళి


రామారావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

గోదావరిఖని, మే 4 (ఆంధ్రజ్యోతి): అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో అరుణోదయ రామారావు వర్ధంతి నిర్వహించారు. రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈ నరేష్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో అరుణోదయ రామారావు విప్లవ సాంస్కృతిక రంగానికి అందించిన సేవలు మరువలేనివని, అంకిత భావం విప్లవ సాంస్కృతిక రంగంలో పనిచేసే ప్రతి కళాకారునికి ఆదర్శప్రా యమన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ, న్యూడెమోక్రసీ నాయకులకు బీ అశోక్, ఈ రామకృష్ణ, ఐ రాజేశం, జీ మల్లేశం, కోంద్ర మొగిలి, తోట్ల రాయమల్లు, పెరక మొండయ్య, దాసరి నర్సయ్య, చంద్రయ్య, శేఖర్, నారాయణ, తిరుపతి, ఎన్‌సీ బాబు, దుర్గం పోచయ్య, కిరణ్, వెంకటేష్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే కార్మిక హక్కులను కాపాడుకోగలుగుతాం



సమావేశంలో మాట్లాడుతున్న ఐ కృష్ణ

గోదావరిఖని, మే 4(ఆంధ్రజ్యోతి): సమరశీల పోరాటాల ద్వారానే కార్మిక హక్కులను కాపాడుకోగలుతామని గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ)రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ కృష్ణ అన్నారు. ఆదివారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో రామకృష్ణ అధ్యక్షతన రామగుండం రీజియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ సింగరేణి గని కార్మికుల హక్కుల కోసం నిజాయితీగా పోరాటాలు నిర్వహించిన చరిత్ర జీఎల్‌బీకేఎస్‌కు ఉందని, అనేక ఆటుపోట్లను, ప్రభుత్వ నిర్బంధాన్ని, సింగరేణి యాజమాన్య నిరంకుశ విధానాలను ఎదుర్కొన్నదని, సంఘం నాయకులు రాములు, కుమారస్వామిలతో పాటు ఎంతో మంది కార్మిక నాయకులు అమరులయ్యారు. ఈనెల 20న జరిగే సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలన్నారు. కేంద్రంలో మోదీ, అమిత్ షాలు కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి కార్పొరేట్ శక్తులకు కార్మికులను బానిసలుగా చేసే కుట్రలకు ఒడిగట్టిందన్నారు. రామగుండం రీజియన్, డివిజన్‌ల కార్యవర్గాలను ఎన్నుకున్నారు.

రామగుండం రీజియన్ కమిటీ అధ్యక్షుడిగా బీ అశోక్, ఉపాధ్యక్షుడిగా తొట్ల రాయమల్లు, కార్యదర్శిగా ఈదునూరి రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా చింతల శేఖర్, కోశాధికారిగా గుండేటి మల్లేశం, కార్యవర్గ సభ్యులుగా ఎస్ ప్రసాద్, ఎన్‌సీ బాబు, పీ మొండయ్య, బీ కిరణ్, ఏ చంద్రయ్య, దాసరి నర్సయ్య, కే తిరుపతి, ఎం నారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

ఆర్‌జీ-1 డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా ఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎన్‌సీ బాబు, కార్యదర్శిగా చింతల శేఖర్, సహాయ కార్యదర్శిగా పీ మొండయ్య, కోశాధికారిగా బీ కిరణ్, కార్యవర్గ సభ్యులుగా ఇర్ఫాన్, శ్రీకాంత్, శ్రీనివాస్, రాజకుమార్, తిరుపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆర్‌జీ-1, 3 డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా తొట్ల రాయమల్లు, ఉపాధ్యక్షుడిగా దాసరి నర్సయ్య, కార్యదర్శిగా చంద్రయ్య, సహాయ కార్యదర్శిగా కే తిరుపతి, కోశాధికారిగా నారాయణలను ఎన్నుకొన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేష్ జిల్లా నాయకులు దుర్గం పోచయ్య పాల్గొన్నారు.



పర్సనల్ అధికారుల ఖాళీలను భర్తీ చేయాలి

గోదావరిఖని, మే 4(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా జీఎం ఆఫీస్‌లో పర్సనల్ అధికారుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ ప్రకటనలో డిమాండ్ చేశారు. పర్సనల్ అధికారుల కొరతతో కార్మికులకు రావాల్సిన ప్రయోజనాల్లో జాప్యం జరుగుతున్నదని, దీంతో కార్మికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తెలిపారు. గతంలో ఐదుగురు అధికారులు పర్సనల్ విభాగంలో పని చేసే వారని, ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉండడంతో పనులు ఆలస్యం అవుతున్నట్టు పేర్కొన్నారు. ఉన్న ఇద్దరు పర్సనల్ అధికారులపై పని భారంతో పనులు పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు. పూర్తిస్థాయి అధికారులను నియమించాల్సిన అవసరం ఉన్నదని, యాజమాన్యం అవసరమైన మేర పర్సనల్ విభాగంలో అధికారులను నియమించాలని అయిలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.